సాక్షి
ములుగు
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



కేడీసీని మరింత అభివృద్ధి చేసుకోవాలి

కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని న్యాక్ కమిటీ చైర్మన్, శ్రీనగర్ ఇస్లామియా యూనివర్సిటీ మాజీ వీసీ ముస్తాక్ ఎ.సిద్ధిఖి సూచించారు. - 8లో ▸



'శివరాత్రి'కి సిద్ధం

ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. ఇప్పటికే అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34.0^0/16.0^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: ఆర్థిక పునరావాసం కోసం జిల్లాలోని దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆర్థిక పునరావాసం పథకం కింద జిల్లాకు రూ.10లక్షల విలువగల 15యూనిట్లను కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ఈనెల 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఇతర వివరాలకు జిల్లాకేంద్రంలోని ప్రగతి భవన్ జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో లేదా 96523 11084 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా సంక్షేమాధికారి సామ్యూల్ పేర్కొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్స్ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్ 2, 3, 4 ఉచిత శిక్షణ తరగతులను గురువారం కలెక్టర్ భవేష్‌మిశ్రా ప్రారంభించారు. పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి సునీత, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

గ్రూప్ పరీక్షలకు శిక్షణ పొందే నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వామివారికి నంది వాహనం బహూకరణ



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి వెండి నంది వాహనాన్ని హైదరాబాద్‌కు చెందిన తన్నీరు శేషుబాబు రాజు–పద్మావతి దంపతులు గురువారం ఈఓ మహేష్‌కు అందజేశారు. రూ. 2లక్షల విలువ వరకు ఉంటుందని ఈఓ తెలిపారు. ఆయన వెంట అర్చకులు కృష్ణమూర్తిశర్మ, ఫణీంద్రశర్మ, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి రూరల్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టిజన్ జేఏసీ నాయకులు మోతుకూరి కోటి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు గురువారం జిల్లాకేంద్రంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్చూర్, డీఈ నాగరాజులకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది తక్కువ ఉన్నచోట డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. దీంతో ఉద్యోగులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలీడేలను వెంటనే ఇప్పించాలన్నారు. ఒకేదగ్గర డ్యూటీలు వేయించాలని కోరారు. ఆర్టిజన్‌లకు కన్వర్షన్ పీఆర్సీ కూడా అందజేయాలని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేదంటే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో జేఏసీ నాయకులు యాళ్ల సురేందర్, గుంటి రాజు, సామర్ల పైడయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలి

భూపాలపల్లి అర్బన్: గని ప్రమాదానికి మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేస్తూ ఇచ్చిన క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్‌చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏరియాలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్ 3లో దురదృష్టావశాత్తు జరిగిన ప్రమాదానికి ముగ్గురు మైనింగ్ సూపర్‌వైజర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. గనిలో జరిగే ప్రమాదాలకు కేవలం మైనింగ్ సిబ్బందిని మాత్రమే బాధ్యులను చేసి చర్యలు తీసుకోవడం అత్యంత విచారకరమని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏరియా జీఎం శ్రీనివాస్‌రావుకు అందజేశారు.

అర్హత లేని ఇంజనీర్లు!

ఐటీడీఏలో లోపాలను కప్పిపుచ్చుకుంటూ ఉన్నత ఉద్యోగులుగా చెలామణి

- టెక్నికల్ అసిస్టెంట్లకు ఏఈఈ బాధ్యతలు
- డ్రాఫ్ట్‌మెన్‌కు డీఈఈ



క్వార్టర్స్‌లో గోడకు పెచ్చులూడిన దృశ్యం

ఏటూరునాగారం: అర్హత, సరైన పరిజ్ఞానం, సాంకేతికంగా సర్టిఫికెట్లు లేని వారంతా ఐటీడీఏ ఇంజనీర్లుగా చెలామణి అవుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న ఏఈఈ, జేఈఈ, డీఈఈల ఉద్యోగానికి తగ్గ చదువులు లేకుండానే దర్జాగా ఆ పదవులను అనుభవిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులకు లక్షల్లో ముడుపులు చెల్లించి వారి లోపాలను కప్పిపుచ్చుకుంటూ ఉన్నత ఉద్యోగులుగా చెలామణి కావడం ఐటీడీఏలో కొనసాగుతోంది. టెక్నికల్ అసిస్టెంట్ స్థాయికి ఎంబీ రికార్డులు రాసే అర్హత లేకున్నా కొనసాగిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 10 మంది టెక్నికల్ అసిస్టెంట్లు ఏఈఈలుగా కొనసాగడం గమనార్హం.

మూడు సబ్ డివిజన్లు

ఏటూరునాగారం ఐటీడీఏ కింద మూడు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఏటూరునాగారం, పస్రా, కొత్తగూడ సబ్ డివిజన్‌లకు సీనియర్ అయిన ఏఈఈలకు డీఈఈగా బాధ్యతలు ఇవ్వవచ్చు. కానీ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ డీఈఈ వరంగల్‌లో పనిచేసే డ్రాఫ్ట్‌మెన్‌కు డీఈఈగా ఫుల్ అడిషనల్ చార్జ్ ఇచ్చి వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఇలా ఇంజనీరింగ్ సెక్షన్‌లో అర్హతకు తగ్గట్టుగా ఉద్యోగస్తులు లేకపోవడంతో నిర్మాణాలు పేకమేడల్లా కూలిపోయే పరిస్థితి ఉంది. నాణ్యత ప్రమాణాలు, సాంకేతికంగా సిమెంట్, కంకర, ఇసుక, బేస్‌మెంట్‌లు, పునాదులు, రోడ్లు ఇలా పలు రకాలుగా నిర్మించే పనుల్లో నాణ్యత డొల్లతనం కనిపిస్తోంది. అయితే గతంలో ఇతర పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలో సివిల్ ఇంజనీర్లుగా ఉత్తీర్ణత పొంది ఉద్యోగాలు చేస్తున్న వారికి ఐటీడీఏలో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ అధికారిగా ఇన్‌చార్జ్ అప్పగించి నాణ్యమైన పనులు చేయించేవారు. ఇప్పుడు అర్హత లేనివారు కాసులను కుమ్మరిస్తూ ఆ ఉద్యోగాల్లో చెలామణి కావడం బాధాకరం.

అనర్హులకు అందలం..అర్హులకు అన్యాయం



జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న మరుగుదొడ్ల పనులను పరిశీలిస్తున్న టీఏ లక్ష్మణ్(ఏఈఈ)

ములుగు(పస్రా) డీఈఈగా ఉన్న హేమలతను ఏటూరునాగారం ఈఈ బాధ్యతలను అప్పగించారు. అలాగే ఏటూరునాగారం డీఈఈగా ఉన్న నవీన్, టెక్నికల్ అసిస్టెంట్ ఏఈఈగా కొనసాగిన అబీద్‌ఖాన్‌లు ఇద్దరు గత నెలలో ఏసీబీకి ట్రాప్ అయ్యారు. వారి స్థానంలో ఏఈఈ శ్రీదేవి ఇటీవల ఏటూరునాగారం బాధ్యతలను చేపట్టారు. కొత్తగూడలో ఉన్న డ్రాఫ్ట్‌మెన్ రాంరెడ్డికి డీఈఈగా ఇవ్వడంతో అర్హత కలిగిన డీఈఈలకు అన్యాయం జరిగింది. అంతేకాకుండా రాంరెడ్డికి డిపార్ట్‌మెంట్ టెస్టు రాస్తేనే డీఈఈగా ఉండాలని లేకుంటే తిరిగి డీఎంగా పంపించాల్సి ఉంటుంది. కానీ ఐదేళ్లు అయినప్పటికీ డిపార్ట్‌మెంట్ టెస్ట్ రాయకుండానే అతడిని ఆ పోస్టులో కొనసాగించేందుకు ఉన్నతాధికారులకు ముడుపులు పెద్ద ఎత్తున అందుతున్నట్లు సమాచారం. పస్రా ఏఈఈగా ఉన్న వ్యక్తి సంపత్‌కు డీఈఈగా ఇన్‌చార్జ్ ఇచ్చారు. ఏటూరునాగారం డీఈఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు ప్రస్తుత ఈఈకే ఇన్‌చార్జ్ ఇచ్చారు. సివిల్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్ ఒకే ఒక్క వ్యక్తి గూడూరుకు చెందిన ఎర్రయ్యకు మాత్రమే ఉంది. మిగతా ఏజెన్సీ మండలాల్లో పనిచేసే ఏఈఈలకు ఎలాంటి అర్హత లేకపోగా వారికి ఎంబీ రికార్డులు రాసే అర్హత లేదు. టీఏలు ఎంబీ రికార్డులు రాస్తే ఏదైనా నిర్మాణంలో సమస్య వస్తే అందుకు డీఈఈ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంగా ఆదేశాలున్నాయి. అంతేకాకుండా అర్హత కలిగిన వ్యక్తులను లూప్‌లైన్‌లో కేవలం ఇంజనీరింగ్ కార్యాలయాలకు పరిమితం చేయడం బాధాకరం. ఈ విషయంపై గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ దృష్టికి కూడా పలు సంఘాల నాయకులు ఇటీవల తీసుకెళ్లినట్లు సమాచారం.

క్వార్టర్స్ ఐదేళ్లకే మరమ్మతులు

అర్హత, అనుభవం లేని ఈఈ, డీఈఈ, ఏఈఈల వల్ల కోట్ల రూపాయల విలువ చేసే ఐటీడీఏ స్టాఫ్ క్వార్టర్స్ ఐదేళ్లకే మరమ్మతులకు రావడం ఇంజనీరింగ్ అధికారుల పనితనానికి నిదర్శనంగా మారింది. వర్షాకాలం వస్తే స్లాబ్‌లో నుంచి వరదలే వరదలు.. అందులో నివాసం ఉండే అధికారులు పూరిగుడిసెల్లో ఉన్నట్లుగా నీళ్లు కారే దగ్గర గిన్నెలు, బకెట్లు పెట్టుకోవాల్సిన దుస్థితి ఉంది. ఇటీవల మళ్లీ సుమారు రూ. 4 లక్షలతో మరమ్మతులు చేయించడం గమనార్హం. ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తే నాణ్యమైన నిర్మాణాలు, గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఏజెన్సీ గిరిజనులు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

వీసీలో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ కృష్ణ ఆదిత్య, పీఓ అంకిత్, అధికారులు

ములుగు రూరల్: ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు పూర్తి చేయాలని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి వెలుగు, డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 28 నాటికి పూర్తి చేయాలన్నారు. జీఓ 58 ప్రకారం అర్హులకు భూముల క్రమబద్ధీకరణ పత్రాలను జారీ చేయాలన్నారు. కంటి వెలుగు శిబిరంలో లబ్ధిదారులకు కంటి అద్దాలను పంపిణీ చేసిన అనంతరం బాధితుడి ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వైద్యాధికారులకు సూచించారు. జీఓ నంబర్ 58, 59, 76, 118కి సంబంధించిన దరఖాస్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోడుసాగుదారులకు అందించనున్న పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వైవీ గణేశ్, డీఎఫ్ఓ కృష్ణగౌడ్, డీఆర్ఓ రమాదేవి, డీపీఓ వెంకయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, ఈఈ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్ డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న రవికుమార్

ములుగు రూరల్(గోవిందరావుపేట): తునికాకు బోనస్ డబ్బులను కూలీలకు వెంటనే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రాజ్‌కుమార్ అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి ఇప్పటి వరకు బోనస్ డబ్బులను కూలీలకు చెల్లించలేదని ఆరోపించారు. ఫారెస్టు అధికారుల ఖాతాలలో కోట్ల రూపాయలు నిల్వ ఉన్నాయని వాటిని కూలీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోడు సాగు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న గిరిజన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేయాలన్నారు. అటవీహక్కుల చట్టం ప్రకారం కాస్తు, కబ్జాలో ఉన్న గిరిజనులకు హక్కు పత్రాలను అందించాలన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి పట్టాలు అందించాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, తీగల ఆదిరెడ్డి, రత్నం రాజేందర్, ఎండి అమ్జద్‌పాషా, దావూద్, గపూర్, రఘుపతి, పాదిళ్ల చిట్టిబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఓ అంకిత్‌కు జ్ఞాపిక అందజేత



ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయిలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ జాతర విజయవంతం కావడానికి కృషిచేసిన ఐటీడీఏ పీఓ అంకిత్‌కు గురువారం పీఓ చాంబర్‌లో కొండాయి సర్పంచ్ కాకా వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజుల ప్రతిమలతో కూడిన జ్ఞాపికను పీఓకు అందజేశారు.

వైభవంగా నాగులమ్మ, వనదేవతల జాతర



ఎదుర్కోలు నిర్వహిస్తున్న గిరిజనులు



వరంపట్టిన భక్తుల పైనుంచి దాటుతూ..

భారీగా తరలివచ్చిన భక్తులు, అమ్మవార్లకు పూజలు

మంగపేట: మండల పరిధిలోని దోమెడలో నాగులమ్మ, వనదేవతల ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ పూజారి పాయం నర్సింహారావు(దేవర బాల) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. దోమెడ శివారులో వెలిసిన నాగులమ్మ ఆలయంలో అమ్మవారి జాతర మంగళవారం మండె మెలిగే కార్యక్రమంతో ప్రారంభమైంది. రెండోరోజు బుధవారం గుట్ట నుంచి దేవరను గుడికి చేర్చారు. మూడో రోజు గురువారం కొప్పు గుట్ట నుంచి డోలి వాయిద్యాల నడుమ దోమెడకు తీసుకువచ్చిన వనదేవతకు, ఆలయం నుంచి తీసుకొచ్చిన నాగులమ్మ అమ్మవారికి గ్రామంలో ఎదుర్కోలు కార్యక్రమాన్ని గిరిజనులు సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతి, నీటి బిందెలతో ఎదురేగి నీళ్లారబోసి భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆలయంలో కోరిన కోర్కెలు తీర్చాలని మహిళలు, యువతులు వరం పట్టారు.

అగ్ని గుండాలు..

గురువారం రాత్రి 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నాగులమ్మ అమ్మవారి అనుగ్రహంతో ఆలయ పూజారి నర్సింహారావు అగ్ని గుండాలలో నడవడం, ముళ్ల ఉయ్యాలపై ఊగే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దోమెడ సమీపంలోని తక్కెళ్లగూడెం, చింతకుంట, నిమ్మగూడెం, తిమ్మాపురం, బ్రాహ్మణపల్లి, రాజుపేట తదితర గ్రామాలతో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నాగుల వెంకటేశ్వర్లు, రాజు, నక్క వినోద్, నాగేశ్వర్‌రావు, గ్రామ పెద్దలు కొమరం లక్ష్మయ్య, మేకల పుల్లారావు, బిజ్జ భూషణం, పూనెం పెంటయ్య, యూత్ కమిటీ సభ్యులు తోలెం ప్రసాద్, బిజ్జ స్వామి, కొమరం రఘు, రామారావు, రామనాథం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: బీఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణలో ఓటమి తప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జంగాలపల్లిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో బంగారు తెలంగాణగా మారుస్తానని ప్రగల్భాలు పలికి తన కుటుంబాన్ని, బంగారుమయం చేసుకున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూం ఇళ్లు, మూడెకరాల భూమి, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేసి గద్దె నెక్కారని ఆరోపించారు. రాష్ట్రంలో గొప్పగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతూ విద్యుత్ బిల్లులు, బస్ చార్జీలు, పెట్రోల్ ధరలు పెంచి పేదలపై పెను భారాలు సీఎం కేసీఆర్ మోపుతున్నారని వివరించారు. ప్రజలు ఓటు హక్కును ఆయుధంగా వాడుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణవేణి నాయక్, మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, కొత్త సురేందర్, రాయకంటి పరమేశ్వర్, బాలజీ, సంతోష్, మోహన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



వేటగాళ్ల ఉచ్చుకు పులి బలి?

దేవాదులలో నాలుగు మోటార్లతో పంపింగ్

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

- 10లో ▸

ఆశీస్సులు తీసుకుని.. ఆశీర్వాదం కోరుతూ

పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- ఐనవోలు, వర్ధన్నపేటలో సాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- ఉదయం మల్లికార్జునస్వామికి పూజలు
- మార్గమధ్యలో కరెంటు, ఇళ్లు, తదితర సమస్యలను వివరించిన ప్రజలు
- మీ ఆశీర్వాదం ఉండాలని కోరుతూ ముందుకు
- ఎమ్మెల్యే రమేష్ ఉద్యోగం ఊడగొట్టండని రేవంత్ పిలుపు



ఐనవోలులో పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఐనవోలు/వర్ధన్నపేట: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆశీస్సులు తీసుకుని.. దారి పొడవునా ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో ఉత్సాహంగా సాగింది. అక్కడక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్‌పై విమర్శలు చేస్తూ స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలకేంద్రంలో బస చేసిన రేవంత్‌రెడ్డి ఉదయం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులు తీసుకుని పాదయాత్ర ప్రారంభించారు. నందిసెంటర్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్, బీసీ, ఎస్సీ కాలనీల గుండా పెరుమాండ్లగూడెం, పంథిని గ్రామాల మీదుగా సాగింది. పలు చోట్ల ఆయన పలువురిని పలకరిస్తూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరుతూ ముందుకు సాగారు. దారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండగా అందులోకి వెళ్లి ఏఈ అయిలయ్యకు ఏసీడీ చార్జీలు వసూలు చేయొద్దని, వ్యవసాయానికి రాత్రి వేళల్లో విద్యుత్ ఇవ్వకుండా పగలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తూరు ఎల్లయ్య వ్యవసాయ క్షేత్రం వద్ద ఆగిన రేవంత్ మొక్కజొన్న పంటను మేపుతుండగా ఎందుకని ఆరా తీశారు. చాలీచాలని కరెంటుతో నీరందకపోవడంతో ఎండిపోతున్నట్లు వాపోయాడు. కొంతమంది రైతులు ధరణి పోర్టల్ సమస్యలు రేవంత్ దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామన్నారు. బొల్లె బోయిన రమేష్ మిషన్ సాయంతో మొక్కజొన్న చేను కోస్తుండగా అక్కడకు వెళ్లి మిషన్ డ్రైవింగ్ సీటులో కూర్చుని నడిపాడు. పెరుమాండ్లగూడానికి రేవంత్ చేరుకోగా ఆయనను మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ల్యాండ్ పూలింగ్ అంశంలో గ్రామానికి చెందిన 12మందిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని రేవంత్‌కు తెలిపారు. పంథినిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కాగా, పాదయాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి ఐనవోలు అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేయకుండానే ముందుకు సాగడంపై స్థానికంగా చర్చ జరిగింది. అక్కడినుంచి వరంగల్ జిల్లాలోకి ప్రవేశించింది. వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త వంగాల గజేందర్ ఇంటికి వెళ్లి తలుపుపై హాథ్ సే హాథ్ స్టిక్కర్‌ను అతికించారు. పాదయాత్రలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, కోదండరెడ్డి, మహేశ్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, స్వర్ణ, మండల పార్టీ నాయకులు మహేష్, కుమారస్వామి, సంపత్, ఎం చిరంజీవి, భాస్కర్, చిరంజీవి రెడ్డి, రాజు, సునీల్, మహేందర్, బండి సుధాకర్, బోంపెల్లి దేవేందర్‌రావు, జక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేశ్ పదవిని ఊడగొట్టండి

వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఉద్యోగం ప్రజలు ఊడగొడితేనే అందరికీ క్షేమం కలుగుతుందని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములను లాక్కుని అరూరి రమేష్ వాటి ధరలు పెంచుకుంటున్నాడని ఆరోపించారు. రమేష్ పోతేనే మీ భూములు మీకు దక్కుతాయని సూచించారు. ప్రజలు గ్రామాల్లో ఎన్నో సమస్యలు వివరిస్తుంటే కేసీఆర్ మాత్రం అసలు తెలంగాణలో సమస్యలే లేవని, ఢిల్లీకి వెళ్లి ఉద్ధరిస్తానని బయలుదేరాడని ఎద్దేవా చేశారు.

'సరుకుల నాణ్యతలో రాజీలేదు'



ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని ఏటీడీఓ దేశిరాం అన్నారు. మండల కేంద్రంలోని జీసీసీ గోదాం వద్ద నిత్యావసర సరుకుల శాంపిళ్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏటీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి నాణ్యమైన సరుకులను జీసీసీ ద్వారా సరఫరా చేయాలన్నారు. హాస్టళ్లకు సరుకులు రాగానే వస్తువులను సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాత దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, మేనేజర్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలి



కాశిందేవిపేటలో పంటను పరిశీలిస్తున్న డీఏఓ

ములుగు రూరల్: రైతులు యాసంగి వరి సాగులో నత్రజని ఎరువుల వాడకం తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గౌస్ హైదర్ అన్నారు. మండల పరిధిలోని కాశిందేవిపేటలో వరి పంటలను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. వరి సాగు చేసే రైతులు నాటు దుక్కిలో ఎకరాకు మూడు టన్నుల పశువుల ఎరువు లేదా సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను ఎకరాకు 150 కిలోల నుంచి 200ల కిలోల వరకు చల్లుకోవాలన్నారు. నాటు సమయంలో యూరియా 40కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 35 కేజీలు, జింక్ సల్ఫేట్ 20 కేజీలు వేసుకోవాలని సూచించారు. యాసంగి సాగు పంటలకు సూపర్ పాస్ఫేట్ వేసుకోవాలన్నారు. పిలక దశ, చిరు పొట్టదశలో యూరియా 40 కేజీల చొప్పున వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్, వ్యవసాయ విస్తర్ణ అధికారి బొంతల రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

కేడీసీని మరింత అభివృద్ధి చేసుకోవాలి

- న్యాక్ కమిటీ చైర్మన్ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ
- ముగిసిన న్యాక్ కమిటీ సందర్శన



మాట్లాడుతున్న న్యాక్ కమిటీ చైర్మన్, మాజీ వీసీ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని న్యాక్ కమిటీ చైర్మన్ జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్ ఇస్లామియా యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ సూచించారు. కేడీసీ న్యాక్ కమిటీ బృందం రెండో రోజు గురువారం ఆకళాశాలలోని విద్యార్థులకు కల్పిస్తున్న భౌతిక వనరులు, కళాశాలలోని సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఆకళాశాల సెమినార్ హాల్‌లో ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా న్యాక్ కమిటీ చైర్మన్ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ మాట్లాడుతూ.. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తే బాగుంటుందన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రెండ్రోజులుగా కేడీసీలో అకాడమిక్‌పరంగా, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించిన అంశాలపై నివేదికను ఆ కమిటీ బృందం చైర్మన్ ముస్తాఖ్ సిద్ధిఖీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డికి అందించారు. ఎగ్జిట్ మీటింగ్‌తో న్యాక్ కమిటీ సందర్శన ముగిసింది. కాగా.. కేడీసీని న్యాక్ కమిటీ సందర్శించిన నేపథ్యంలో గురువారం కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, పాలక మండలి సభ్యులు చంద్రమౌళి న్యాక్ కమిటీతో భేటీ అయ్యారు. ఉన్నత విద్య, వర్సిటీల విద్యపై చర్చించారు. న్యాక్ కమిటీ మెంబర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మంటన్ కుమార్‌సింగ్, పంజాబ్‌లోని లూథియానా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ప్రగత్‌సింగ్, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ బి.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య


కీసరి రాజు(ఫైల్)

ములుగు రూరల్: అప్పుల బాధతో మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన కీసరి రాజు(43) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజు తన సొంత భూమి 1.20 ఎకరాలతో పాటు 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గింది. పంట పెట్టుబడికి తెచ్చిన రూ.30 లక్షలు అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చేను నుంచి ఇంటికొచ్చిన కుటుంబ సభ్యులు విగతజీవిగా పడి ఉన్న రాజును ములుగు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో అతడు మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రెండో ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

కురవి వీరభద్రస్వామి ఆలయం





శివరాత్రికి సిద్ధం

- నేటి నుంచి ఉత్సవాలు షురూ
- కిటకిటలాడనున్న శైవక్షేత్రాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి

కాళేశ్వరాలయంలో..

కాళేశ్వరం: కాళేశ్వరముక్తీశ్వరాలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు స్వామివార్లను దర్శించుకోనున్నారు. శివరాత్రి సందర్భంగా శివుడు–యముడు కొలువైన క్షేత్రం భక్తులతో కిటకిటలాడనుంది. భక్తులకు ఇబ్బందుల్లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి తీరం వద్ద మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలికంగా గదులు ఏర్పాటు చేశారు. బ్యాక్‌వాటర్‌తో వరద ఉధృతి ఉండడంతో జల్లు స్నానాలు చేసేందుకు నల్లాలు అమర్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ప్రైవేటు వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను మూడు చోట్ల ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. 12 క్వింటాళ్ల లడ్డూ ప్రసాదం, 8 క్వింటాళ్ల పులిహోర భక్తులకు సరిపడా తయారు చేస్తున్నారు.


కాళేశ్వరం గోదావరి తీరం వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు, డ్రెస్సింగ్ రూమ్స్

నేటి నుంచి ప్రత్యేక పూజలు..
17న శుక్రవారం దీపారాధన, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ రుద్రహవనం, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు, కళాకారులతో సంగీత కార్యక్రమాలుంటాయి. 18న శ్రీముక్తీశ్వర–శుభానందల కల్యాణం, రాత్రి హరికథా కాలక్షేపం కార్యక్రమాలుంటాయి. రాత్రి 12 గంటలకు మహాభిషేకం, లింగోద్భవ పూజలు నిర్వహించనున్నారు. 19న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం పూర్ణాహుతి, నదస్యము, మహాదాశీర్వాదం, పండిత సన్మానం ఉంటుంది. సాయంత్రం శ్రీ ఆదిముక్తీశ్వరస్వామి కల్యాణం జరుపుతారు. రాత్రి 8గంటలకు పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయి.

వీరన్న ఆలయంలో..


వీరభద్రస్వామి మూల విరాట్

కురవి: ప్రముఖ శైవ క్షేత్రమైన కురవి వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 18న మహా శివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరపనున్నారు. మార్చి 4 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ముఖ్య ఘట్టాలివే..
శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి 11గంటల వరకు పూర్ణాభిషేకంలో స్వామివారు దర్శనమిస్తారు. రాత్రి 12.43కు ఆదివారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. 19 నుంచి 20 వరకు అభిషేకాలు, బలిహరణ నిర్వహిస్తారు. 21న పెద్ద చెరువులో తెప్పోత్సవం, 23న స్వామివారి రథోత్సవం, 24న పూర్ణాహుతి, బండ్లు తిరుగుట, పారువేట, 25న వసంతోత్సవం, త్రిశూలస్నానం(పెద్దచెరువులో), ఏకాంత సేవ, నాగవెల్లి, 26న స్వామివారి పవళింపు సేవ, మార్చి 3న శివాయలంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం, 4న 16 రోజుల పండుగతో ఉత్సవాలు ముగుస్తాయి.

మెట్టుగుట్టలో..


పూజలు చేస్తున్న అర్చకులు

మడికొండ: మెట్టుగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమై ఈనెల 24వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో భాగంగా గురువారం సుప్రభాతం, స్వామి వారికి రుద్రాభిషేకం, గణపతిపూజ, సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈఓ భారతి, ఆలయ కమిటీ చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అఖిలాశ్, శర్మ, శ్రీ సత్యనారాయణశర్మ, విష్ణువర్ధనాచార్యులు, ధర్మకర్తలు కుమారస్వామి, భూపాల్‌రెడ్డి, బుర్ర సంధ్యారాణి, రాజు, పెద్ది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీపీ
మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలు షురూ


సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న ఈఓ నాగేశ్వర్‌రావు, అర్చకులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామికి బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. గురువారం ఒగ్గు పూజారుల మేలు కొలుపుతో స్వామి మేల్కొనగా అర్చకులు వేద మంత్రాలతో నిత్య పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం ఉత్సవ మూర్తులతో సూర్యప్రభ వాహనసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, భాను ప్రసాద్, నరేశ్ శర్మ, మధు శర్మ, వేద పండిట్ గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మాడ వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయ ఆవరణలో ధ్వజారోహణం చేసి జాతర ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనసేవ విద్యుత్ దీప అలంకారాల మధ్య ఘనంగా నిర్వహించారు.

పాలకుర్తిలో..


గుహలో సోమేశ్వరుడు

పాలకుర్తి టౌన్: పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయం హరిహరులకు నిలయంగా, స్వయంభువులుగా ఒకే గుట్టపై వెలిసిన క్షేత్రంగా వెలుగొందుతుంది. ఇక్కడ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. 18న స్వామి వారి కల్యాణంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ రామచంద్రయ్య శర్మ తెలిపారు.

బ్రహ్మోత్సవాలిలా..
మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 17న గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, 18న స్వామి వారి కల్యాణం, 19న రథోత్సవం, బండ్లు తిరుగుట, 20న డోలారోహణం, వసంతోత్సవం, 21న అగ్నిగుండంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలకు సిద్ధమైన కోటగుళ్లు


కాంతులీనుతున్న కోటగుళ్ల ఆలయం

గణపురం: మండల కేంద్రంలోని కాకతీయుల కళా క్షేత్రం కోటగుళ్లు శివ రాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 18న జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఆలయ ప్రాంగణం ప్రత్యేక దీపాలంకరణతో కాంతులీనుతోంది. ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

వేయి స్తంభాల ఆలయంలో..


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినయ్

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఏర్పాట్లను ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, హనుమకొండ డీసీపీ ఎమ్.ఏ బారీ, ఏసీపీ కృష్ణ, సీఐ కృష్ణ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. శివరాత్రి సందర్భంగా 5 లక్షల మందికి పైగా భక్తులు రుద్రేశ్వరున్ని దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం పాస్‌లు తీసివేసినట్లు దేవాదాయశాఖ ఫెస్టివల్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. గంగు ఉపేంద్రశర్మ, ఈఓ శేషగిరి మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ అభ్యర్థన మేరకు దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి వద్ద గల శివలింగానికి అభిషేకం చేసుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో పాలుపంచుకునేందుకు భక్తులు చండీహోమానికి రూ. 3,116, స్వామివారి కల్యాణానికి రూ.1,116, అన్నపూజకు రూ. 5,116, లింగోద్భవ కాల పూజకు రూ. 12,116, శివరాత్రి ఉత్సవాల్లో ఐదురోజులు జరిగే పూజల్లో పాల్గొనాలనుకున్న భక్తులు రూ.21,116 చెల్లించవచ్చని తెలిపారు.

కార్యక్రమాలిలా..
17న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం. 18న శ్రీరుద్రేశ్వరస్వామికి సామూహిక రుద్రాభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో జరిపే మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం. 19న మహాపూజ, నాగవెల్లి(సదస్యం), 20వతేదీన మహాన్నపూజ, అన్నప్రసాదాల వితరణ, 21న ఉత్సవ ముగింపులో భాగంగా అంజనేయ స్వామికి చందనోత్సవం, ఆకు పూజ, మహాబిల్వార్చన, చండీహోమం పూర్ణాహుతి పండిత సత్కారం ఉంటుంది.

జనగామలో క్లోరిన్ గ్యాస్ లీక్!

- ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ సమీపాన కూల్చి వేసిన సంపు వద్ద ఘటన..
- 600మందికి పైగా ప్రభావం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 200 మంది..
- విచారణకు ఆదేశించిన అదనపు కలెక్టర్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జనగామ: జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి క్లోరిన్ గ్యాస్ లీక్ కలకలం రేపింది. సిద్దిపేట రోడ్డు కోర్టు ఏరియా సబ్‌జైలుకు ఎదురు నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ సమీపాన కూల్చి వేసిన సంపు వద్ద క్లోరిన్ గ్యాస్ లీకై గాలిలో వేగంగా వ్యాపించింది. దీంతో రోడ్డుపై ఉన్న వందలాది మందితోపాటు ఇళ్లలో ఉన్న వారు సైతం దగ్గు, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు సైతం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గోకుల్‌నగర్, గిర్నిగడ్డతో పాటు చుట్టపక్కల కాలనీలకు చెందిన సుమారు 600 మందికి పైగా ఈ ప్రభావానికి గురయ్యారు. కళ్ల మంటలు, వాంతులు, విరేచనాలతో ఊపిరి ఆడక ఇబ్బంది పడిన 200 మంది వరకు ఆస్పత్రికి పరుగులు పెట్టారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 50 మంది, పట్టణంలోని 8 ప్రైవేటు ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో అడ్మిట్ అయ్యారు. అందరికీ ఆక్సిజన్‌తో కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులతోపాటు ఎస్‌ఐలు భరత్, జీనత్, పోలీసు సిబ్బంది గ్యాస్ లీకైన ప్రాంతానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి పంపించారు. ఓవర్‌ఫ్లో నీటిని స్పీడ్ పెంచడంతో.. సిలిండర్‌లోని క్లోరిన్ అందులో కలిసి ప్రభావం తగ్గింది. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. క్లోరిన్ గ్యాస్ లీకేజీ.. అక్కడ సిలిండర్‌ను ఎందుకు ఉంచారనే దానిపై విచారణకు ఆదేశించారు. క్లోరిన్ గ్యాస్ గాలిలో స్పీడ్‌గా గ్యాపించడంతో గొంతులో మంట, దగ్గు, పలువురికి వాంతులయ్యాయి. ఎటువంటి ప్రమాదం లేదని, జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు పేర్కొన్నారు.

వైభవంగా చండికా అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం


మహాపూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దంపతులు, చిత్రంలో సత్యవతి రాథోడ్

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చండికా అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి రుద్రహోమ సహిత శత చండీహోమం, మహా పూర్ణహుతి, మహాకుంభాభిషేకం, భక్తులకు అమ్మవారి మహాదర్శనం ఇచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉష దంపతులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, డీసీపీ సీతారాం, ఆర్డీఓ కృష్ణవేణి, ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ఈఓ నండూరి రజనీకుమారి, అర్చకులు దేవగిర రామన్న, గౌతం శర్మ, వెంకన్నవర్మ, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కట్న వేధింపులకు ఒకరు బలి

జఫర్‌గఢ్: భర్త, అత్త, మామ వరకట్న వేధింపులతో మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన నాయిని జ్యోతి(30) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తొర్రూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన జ్యోతికి 13 ఏళ్ల క్రితం జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన నాయిని రవితో వివాహమైంది. ఆతర్వాత భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. గత ఆర్నెళ్లుగా జ్యోతి పుట్టింటి వద్దే ఉంది. నెల క్రితం అత్తగారింటికి వచ్చింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఎంజీఎంకు తరలించారు. అప్పటికే జ్యోతి మృతి చెందింది. భర్త రవి, అత్త, మామలు వరకట్నం కోసం వేధించడం కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జ్యోతి మృతదేహానికి గురువారం పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై వెంకటనారాయణ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- బావను హత్య చేసినట్లు ఒప్పుకున్న మరదలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు

డోర్నకల్: బావను హత్య చేసినట్లు మరదలు ఒప్పుకుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ డి.రమణబాబు నిందితులను చూపి వివరాలు వెల్లడించారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10న మున్నేరువాగు సమీపంలో కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు విచారణ జరిపి సిగ్నల్‌తండాకు చెందిన బానోత్ జగన్‌గా గుర్తించారు. జగన్ తమ్ముడి భార్య సుభద్రతో గతంలో అక్రమ సంబంధం ఉండగా తర్వాత సుభద్ర కారెపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భూక్యా వీరన్నతో అక్రమ సంబంధం ఏర్పర్చుకుంది. వీరన్నతో సంబంధం విషయం తెలిసిన జగన్ తరచూ సుభద్రను ఇబ్బందులకు గురి చేసేవాడు. ప్రియుడితో కలిసి జగన్ అడ్డు తొలగించుకోవాలని సుభద్ర నిర్ణయించుకుంది. ఈనెల 2న జగన్‌కు మద్యం తాగించి మాయమాటలు చెప్పి ముందస్తు ప్రణాళికతో మున్నేరువాగు సమీపానికి తీసుకెళ్లింది. ప్రియుడితో కలిసి సుభద్ర రాళ్లతో బావను కొట్టి చంపినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించి సుభద్ర, వీరన్నను అరెస్ట్ చేసి వీరిపై పలు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ నెల 13న సుభద్రపై అనుమానంతో ఆమెపై దాడి చేసి, చెప్పులదండ వేసిన తండావాసులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈసమావేశంలో డోర్నకల్ సీఐ జె.వెంకటరత్నం, ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.